క్లుప్తంగా

15లోగా నాట్లు వేసుకోవాలి

సైదాపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, బోర్లు, బావులు కింద వ్యవసాయం చేసే రైతులందరూ జనవరి 15వ తేదీ లోపు వరి నాట్లు వేసుకోవాలని ఏఓ హైమావతి సూచించారు. స్థానిక ఏఓ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ ఆతర్వాత నాట్లు వేసుకుంటే వెన్ను తీసే సమయంలో అధిక ఎండల కారణంగా గింజ సరిగా రాక దిగుబడి తగ్గుతుందన్నారు. మండలంలోని అనంతమడుగు, గిద్దలూరు, తురిమెర్ల, చీకవోలు, తుమ్మలతలుపూరు గ్రామాల్లో సాగు చేసిన వరి పంటలో అక్కడక్కడా ఆకుముడత తెగులు కనిపిస్తుందన్నారు. ఆకుముడత తెగులు నివారణకు క్లోరిపైరిపాస్‌ని పిచికారి చేసుకోవాలన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ


హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

చిల్లకూరు: మండలంలోని అద్దెపల్లెలో 32 మంది లబ్ధిదారులకు సర్పంచ్ ఏ నాగమ్మ ఆధ్వర్యంలో కార్యదర్శి చంద్రశేఖర్ హక్కుపత్రాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పేదలు ఎన్నో ఏళ్లుగా అనుభవిస్తున్న గ్రామ కంఠం స్థలాలకు శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం కింద వారికి హక్కులు కల్పించారన్నారు. దీంతో పేదలు ఆస్తిపరులుగా మారారని చెప్పారు.

నేడు జగనన్నకు చెబుదాం

దక్కిలి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం అవరణలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరేలా విన్నవించుకోవచ్చన్నారు. గ్రామాల్లో దండోరా వేయించాలని ఇప్పటికే ఆయా పంచాయతీల కార్యదర్శులకు సూచించినట్లు తెలిపారు.

రక్త నమూనాల సేకరణ


రక్తం తీసుకుంటున్న వైద్య సిబ్బంది

దొరవారిసత్రం: మండలంలోని వేణుంబాకంలో బుధవారం రాత్రి ఫైలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా పలువురు నుంచి వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించి, పరీక్షలు పంపారు. సూపర్‌వైజర్ కిరణ్, వైద్య సిబ్బంది సుధాకర్, వెంకటయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సైదాపురం(వెంకటగిరి): వెంకటగిరికి చెందిన చేనేత కార్మికుడు బండారు దేవరాజు కుటుంబ సభ్యులకు ఎస్వీఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత నక్కా వెంకటేశ్వరరావు ఆర్థిక సాయం చేశారు. బండారు దేవరాజు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటేశ్వరరావు గురువారం మృతుడు దేవరాజులు అంత్యక్రియలకు నగదు అందజేశారు. ఎం శ్రీనివాసులు, మునికృష్ణయ్య, మునెయ్య, మాలవతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ మీట్

వెంకటగిరిరూరల్: మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కార్యాలయ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

విలేజ్ క్లినిక్ తనిఖీ


కొత్తపల్లె విలేజ్ క్లినిక్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ సభ్యులు

దొరవారిసత్రం: మండలంలోని కొత్తపల్లెలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను గురువారం టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్లినిక్‌లో గర్భిణులు, బాలింతలకు పరీక్షలు చేశారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేస్తున్నారా? లేదా అని బృందం సభ్యులు రోగులను అడిగి తెలుసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సభ్యులు నాగేంద్రకుమార్, బాబు, రాణి, వైద్యాధికారి చైతన్య పాల్గొన్నారు.

అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఏపీఓ

దక్కిలి (బాలాయపల్లె): ఉపాధి హామీ పనులపై మేట్లు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఏపీఓ మృత్యుంజయరావు తెలిపారు. గురువారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో మేట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ పనులు మంజూరైన వెంటనే ప్రారంభిస్తామని చెప్పారు. ఎంపీడీఓ ప్రమీలా రాణి, ఈసీ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరించిన కాలం

వరుణుడు కరుణించాడు.. మేఘం వర్షించింది.. చెరువులు నిండుకుండలయ్యాయి.. సాగుకు ఊతమొచ్చింది.. అన్నదాత హలం పట్టి..పొలం దున్ని..పైరు పెడుతున్నాడు. వెరసి..సూళ్లూరుపేట నియోజకవర్గమంతా పచ్చదనం పరుచుకుంటోంది. ఫలితం ఈ రబీలో రికార్డుస్థాయిలో వరిసాగు నమోదు అయ్యింది.

- పొంగిన వాగులు, వంకలు, నదులు
- విస్తారంగా సాగు పనులు


వరినాట్లు వేస్తున్న మహిళలు


ఎడ్లమానుతో పొలాన్ని చదును చేస్తున్న రైతు

పెళ్లకూరు: వరుణదేవుడు కరుణిచడంతో ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు, వంకలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. స్వర్ణముఖినది జల ప్రవాహం జోరుగా సాగుతోంది. పల్లెల్లో ఎక్కడ చూసిన వ్యవసాయ కూలీలు, రైతులు సాగు పనులు చేపట్టడంతో వ్యవసాయం పండుగలా సాగుతోంది. స్వర్ణముఖి సిస్టమ్ కింద పెళ్లకూరు మండలంలో 67 చెరువులు, నాయుడుపేట మండలంలో 77 చెరువులు, ఓజిలి మండలంలో 61 మొత్తం 205 చెరువులకు సాగునీరు పుష్కలంగా చేరింది. పలు చెరువులకు సామర్థ్యానికి మించి వరదనీరు చేరడంతో కలుజులు పారుతున్నాయి. పెళ్లకూరు మండలంలో 4,275 హెక్టార్లు, నాయుడుపేటలో 2,885 హెక్టార్లు, ఓజిలిలో 3,160 హెక్టార్లు మొత్తం 10,320 హెక్టార్లు మేర వరిసాగు చేస్తున్నారు.

జోరుగా సాగు పనులు

సూళ్లూరుపేట నియోజకవర్గంలో రైతులు వరి నాట్లు జోరుగా వేస్తున్నారు. పొలాల్లో ఎక్కడ చూసినా నారుమడులు సిద్ధం చేయడం, వ్యవసాయ కూలీలతో పొలం గట్లు శుభ్రం చేయడం, ట్రాక్టర్లతో దుక్కి దున్నడం, ఎడ్లమానుతో భూమిని చదును చేయడం, వరినాట్లు వేయడం తదితర పనులతో రైతులు, కూలీలతో పొలాలు కళకళలాడుతున్నాయి. ఇప్పటికే ఆర్ఎన్ఆర్, బీపీటీ తదితర వరి నారుమళ్లు పూర్తి చేసుకుని, వరినాట్లు జోరుగా వేస్తున్నారు. అటు వ్యవసాయశాఖ, ఇటు సహకార సంఘంతోపాటు రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తుండడంతో పాటు పెట్టుబడి కింద రైతుభరోసా నగదు అందిన నేపథ్యంలో ఇక్కడి రైతులంతా వ్యవసాయ పనులు జోరుగా చేస్తున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

2019 నుంచి ఏటా వర్షాలు కురుస్తుండడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. స్వర్ణముఖి సిస్టమ్ కింద 9 వేల హెక్టార్లుకు పైగా సాగు చేస్తుండడం విశేషం. గత ఐదేళ్లగా సమృద్ధిగా కురుస్తున్న వర్షాలకు సాగు విస్తీర్ణం పెరగడమే కాకుండా తాగునీటికి ఇబ్బందులు కూడా తలెత్తలేదు.


వరినారు సిద్ధం చేస్తున్న కూలీలు

చెరువులకు జలకళ వచ్చింది


భారీ వర్షాలకు వరదనీరు అత్యధికంగా చేరడంతో చెరువులకు జలకళ వచ్చింది. గత రెండేళ్లగా వర్షాలు పుష్కలంగా కురుస్తుండడంతో అన్ని ప్రాంతాల్లో రైతులు ఆనందంగా సాగు పనులు చేసుకుంటున్నారు. – మరుపూరి మస్తాన్‌రెడ్డి, చెంబేడు

కష్టాలు తొలగిపోయాయి


రెండేళ్ల కిందట చినుకు జాడ లేక సాగు, తాగు నీటికి అనేక కష్టాలు ఎదుర్కొన్నాం. సాగునీరు లేక పంటలను ఎండబెట్టుకుని పశువులకు మేతగా వదిలేసుకున్నాం. ప్రస్తుతం పుష్కలంగా వర్షాలు కురుస్తుండడంతో కష్టాలు తొలగిపోయాయి.
–నర్రావుల లింగమనాయుడు, పునబాక

నేడు మార్కెటింగ్ కమిటీ పాలకవర్గం ప్రమాణం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: తడ మండలం పులివేంద్రం మార్కెటింగ్ కమిటీ కార్యాలయం అవరణలో సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీకి నూతన పాలకవర్గం శుక్రవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రమాణస్వీకారోత్సవానికి వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్థన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు. ప్రమాణస్వీకారోత్సవం అనంతరం తడ మండలం కాదలూరులో సచివాలయం, ఆర్బీకే భవనాలను మంత్రి చేతులు మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నామని తెలిపారు. కమిటీ చైర్‌పర్సన్ కవిత మాట్లాడుతూ తనకు రైతులకు సేవచేసుకునే భాగ్యం కల్పించినందుకు సీఎం జగనన్నకు, మంత్రి కాకాణి గోవర్థన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పీ ప్రభాకర్‌రెడ్డి, ఎం మునీష్‌రెడ్డి, ఎం వెంకటకృష్ణారెడ్డి, సీ సుబ్రమణ్యంస్వామిరెడ్డి, జే వేణుయాదవ్, టీ ప్రసాద్, కే ఆర్ముగం, కే వాసు, ఎస్ గోపీరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పీ పద్మామిల్లన్, కౌన్సిలర్లు పీ విజయలక్ష్మి, ఎస్ సౌజన్య, ఊ మునీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేద్దాం


మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

వెంకటగిరిరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేసి 2024లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి అన్నారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు ప్రాధాన్యం ఇస్తూ ఆహ్వానాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు పి నాగయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పీ శ్రీదేవి, సర్పంచ్‌లు పీ ప్రమీల, విజయమ్మ, వేణురెడ్డి, బత్తయ్య, డక్కిలి జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ సుబ్బయ్య, నేతలు సదారెడ్డి, కే గురుప్రసాద్, తిరుమల, మనోహర్, కె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కేవీకేని సందర్శించిన వ్యవసాయ మండలి డైరెక్టర్


నిమ్మపండ్ల స్క్వాష్‌ను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న అధికారులు

వెంకటగిరిరూరల్: స్థానిక కృషివిజ్ఞాన కేంద్రాన్ని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ (హైదరాబాద్ అటారిజోన్) షేక్ ఎన్ వీర గురువారం సందర్శించారు. కేవీకేలో చేపడుతున్న వ్యవసాయ పనులను కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి గోవిందరాజులు ఆయనకు వివరించారు. అనంతరం కేవీకే సాగవుతున్న పంటలను పరిశీలించారు. అంతకు ముందు నిమ్మపండ్లతో తయారు చేసి స్క్వాష్‌లను విడుదల చేశారు. ఐసీఏఆర్ అటారి జోన్ ప్రధాన శాస్త్రవేత్త ఆర్ రెడ్డి, శ్రీనివాసులు, కేవీకే శాస్త్రవేత్త మధుమతి, ఏడీఏ డాక్టర్ నాగార్జున సాగర్, సీడీపీఓ శంషాద్‌బేగం, శాస్త్రవేత్తలు విజయశ్రీ, నాగార్జునరెడ్డి, రాజీవన, శర్మ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నివారణే లక్ష్యంగా పని చేయాలి


కుష్టు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ అరుణ సులోచన


కుల్లూరులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నాయుడుపేట: కుష్టు వ్యాధి నివారణే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పని చేయాలని అదనపు జిల్లా వైద్యాధికారి, కుష్టు, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ అరుణ సులోచన అన్నారు. గురువారం నాయుడుపేట మున్సిపాలిటీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. ఈనెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు జరిగే (ఎల్‌సీడీసీ) కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తింపు కార్యక్రమం వివరాలపై ఆరా తీశారు. అనంతరం గొట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని జువ్వలపాళెం గ్రామాన్ని సందర్శించి ప్రజలతో చర్చించారు. మచ్చలున్న వారిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే నివారించడం మంచిదన్నారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి కుష్టువ్యాధి నిర్ధారణకు సహకరించాలని సూచించారు. వైద్య బృందాలు పరీక్షలు చేపయాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట డిప్యూటీ పారామెడికల్ అధికారి రాజేంద్రప్రసాద్, మండల నోడల్ అధికారి వెంకటగోపాల్, డాక్టర్ శంకరయ్య, డాక్టర్ వివేక్, డాక్టర్ మౌనిక, డీ అంకయ్య ఉన్నారు.

కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపునకు సర్వే

కలువాయి: కుల్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపు, వ్యాధి నిర్ధారణ, చికిత్సలు, వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పనకు ఇంటింటి సర్వే చేస్తున్నట్లు వైద్యాధికారులు పి.ప్రియాంక, ఎస్‌కే అన్వర్‌బాషా తెలిపారు. కుల్లూరులో గురువారం జరిగిన సర్వేలో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సర్వే బుధవారం ప్రారంభమైందని, జనవరి 12వ తేదీ వరకు సాగుతుందని చెప్పారు. ఆరోగ్యకేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలలో సర్వే జరుగుతుందన్నారు.

కండలేరులో 13.039 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 13.039 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్ కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉన్నత విద్యపై అవగాహన సదస్సు

కోట: విద్యానగర్ ఎన్బీకేఆర్ ఐఎస్టీలో గురువారం ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్ ప్రోగ్రామ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో అమెరికాలోని మసాచుసెట్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయచంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్బీకేఆర్‌తో యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్‌కు అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. దీంతో ఇక్కడి విద్యార్థులు అమెరికాలో ఎమ్మెస్ పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఇండస్ట్రియల్ అండ్ సిస్టం ఇంజినీరింగ్, డేటా సైన్స్ కోర్సుకు ఒప్పందం కుదిరిందన్నారు. త్వరలో కంప్యూటర్‌సైన్స్, కంప్యూటర్ టెక్నాలజీ కోర్సులు చదివేందుకు కూడా ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, విక్రమ్‌కుమార్, శ్రీనివాసులు, అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

జీవనోపాధి పెంపునకు కృషి

గూడూరురూరల్: గృహిణిలు, యువతుల జీవనోపాధి పెంపునకు వైజేపీ లయన్స్ క్లబ్ కృషి చేస్తుందని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, అప్పుడే ఆ కుటుంబం బాగుంటుందని చెప్పారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతమ్, రీజనల్ చైర్మన్ శరద్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసి, రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 14వ వార్డులోని బొగ్గుల మిట్ట, ధర్మాపురం ప్రాంతాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని, సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని స్థానికులు ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్ల పాలనలో నవరత్నాలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు నింపారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి, అవినీతి రహిత పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకొచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భానుప్రియ, విప్ లక్ష్మి, వార్డు కౌన్సిలర్లు ఏ శంకరయ్య, వహీద, కళ్యాణి, ఎంఏ నారాయణ, పార్టీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి సీ హరికృష్ణ, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, నేతలు రమణమ్మ, గోపాల్‌రాజు, పోలయ్య, జాన్, పీ శ్రీనివాసులు, యస్థానీ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంపై అధికారుల విచారణ


భూ వివాదంపై క్షేత్ర సాయిలో చర్చిస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

చిల్లకూరు: మండలంలోని కడివేడు రెవెన్యూ పరిధిలోని పారిచెర్లవారిపాళెం సమీపంలో నెలకొన్న భూ వివాదంపై రెవెన్యూ అధికారులు, పోలీసులు గురువారం విచారణ చేపట్టారు. పారిచెర్లవారిపాళెం సమీపంలో సుమారు 9 ఎకరాల వరకు భూమి ఉండగా అందులో పలువురికి సీజేఎఫ్ఎస్ పట్టాలు మంజూరు చేయగా మరికొంత భూమి సెటిల్‌మెంటు పట్టా ఉంది. అయితే ప్రభుత్వం నుంచి పట్టాలు పొందిన వారు కొంత కాలంగా సాగులో చేస్తుండగా సెటిల్‌మెంట్ పట్టాలు ఉన్న వారు సాగు చేయలేకుండా పోయారు. ఇటీవల వారు వచ్చి తమ భూమిలో సాగు చేస్తున్నారని సీజేఎఫ్ఎస్ లబ్ధిదారులైన గిరిజనలతో వివాదానికి దిగారు. ఈ క్రమంలో పలు పర్యాయాలు ఇరువర్గాలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో వివాదాన్ని పరిష్కరించే క్రమంలో గ్రామానికి తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ అంజిరెడ్డి, వీఆర్వో విద్యావతి భూమి వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రజా సంఘాల నాయకులు ఎల్‌వీ సుబ్బయ్య, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు కుడుముల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం


ఆటో అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం చిల్లకూరు గ్రామానికి చెందిన పొదుపు గ్రూపు సభ్యురాలు పైపూరు ఉషారాణి భర్త విజయభాస్కర్‌కి ఉన్నతి పథకం కింద రూ.3.50 లక్షలు విలువ చేసే ఆటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నీ వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నట్లు పేర్కొన్నారు. కరోనా కష్టాలను, చంద్రబాబు మిగిల్చిన అప్పులను కూడా లెక్క చేయకుండా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అటు నవరత్నాలు, ఇటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. త్వరలో రాబోవు ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఇప్పటికే చంద్రబాబు, పవన్, లోకేష్ అడ్డగోలుగా అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసే కుట్రలు మొదలు పెట్టారని, వాటిని ప్రజలే తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు


ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ


బీసీ కాలనీలో నిర్మించిన సీసీరోడ్డు

ఓజిలి: మండలంలోని మానమాలలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన గడపగడపకు మనప్రభుత్వం నిధులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలు నిర్మిస్తున్నారు. ఈ పనులను పంచాయతీరాజ్ డీఈ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమరెడ్డి పరిశీలించారు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి

సైదాపురం: ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొంటున్న గ్రామీణ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు. మూడో రోజైన గురువారం సైదాపురం ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎంపీడీఓ ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే క్రీడా పరికరాలను అందజేసి, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో పీడీ కోటేశ్వరరావు, కార్యదర్శి శశిఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర

పెళ్లకూరు: ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా మండలంలోని అన్ని సచివాలయాల్లో నిర్వహించిన క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపీడీఓ సురేష్‌బాబు తగిన చర్యలు తీసుకున్నారు. క్రీడాకారులంతా గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఓడిపోయిన వారు మళ్లీ గెలిచేందుకు ప్రయత్నించాలే గానీ నిరాశ చెందకూడదన్నారు.

సత్తా చాటుతున్న క్రీడాకారులు

కోట: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు గ్రామీణ క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. సిద్ధవరంలో సర్పంచ్ శ్రీదేవి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో కర్లపూడి జట్టుపై సిద్ధవరం జట్టు విజయం సాధించింది. రామయ్య, అల్లాభక్షు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆడుదాం

దొరవారిసత్రం: మండలంలో కల్లూరు, ఉచ్చూరు, సూరపుఅగ్రహారం, డీవీ సత్రం బీసీ గురుకుల పాఠశాల ప్రాంతాల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు గురువారం అట్టహాసంగా జరిగాయి. బీసీ గురుకుల పాఠశాలలో బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు వైస్ ఎంపీపీ డీ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

చిల్లకూరు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో మూడో రోజైన గురువారం పలు గ్రామాల్లో క్రీడా పోటీలు హోరా హోరీగా జరిగాయి. మండలంలోని ఓడూరు, వరగలి, లింగవరం, అంకులపాటూరు గ్రామాల్లో జరిగిన వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

రాపూరు: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వసుమతి పేర్కొన్నారు. రాపూరు, కండలేరులో ఆడుదాం ఆంధ్రా క్రీడలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ క్రీడాకారులను గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చేలా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట ఎంపీడీఓ అప్పాజీ, పీడీ రాజేష్ ఉన్నారు.


రాపూరు: క్రీడాకారులతో డీఎల్‌డీపీఓ వసుమతి


చిల్లకూరు: అంకులపాటూరులో వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న యువత


సైదాపురం: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ




కోట: వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు, పెళ్లకూరు: చెంబేడులో క్రికెట్ ఆడుతున్న యువకులు, దొరవారిసత్రం: బీసీ గురుకుల పాఠశాలలో ఖోఖో క్రీడలో పాల్గొన్న మహిళలు